తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
17 సెప్టెంబర్ 2026

## ఖద్దరు చొక్కా వెనకాల

# కనబడని కన్నీటి గాథలు

- రాజకీయ మోజులో పడి అప్పుల పాలవుతున్న నేతలు
- హారతి కర్పూరంలా కరుగుతున్న ఆస్తులు





**చేర్యాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** రాజకీయం అంటేనే ఒక మోజు.. ఆ మోజులో పెద్దనాయకులు ఏమోకానీ మండల స్థాయి నాయకులు, గ్రామ స్థాయి నాయకులు దర్పం కోసం ఖరీదైన కార్లు.. ఖద్దరు చొక్కాలతో స్థాయికి మించిన ఖర్చులు చేస్తూ ఆస్తులు హరించుకుంటూ అప్పులపాలవుతున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు లక్షల వ్యయం చేయడం..పదవులు , పదవులు అనుభవిస్తున్నా, అనుకున్న పదవి దక్కకపోయినా ఏదో ఒకరోజు వస్తుందనే ఆశతో స్థాయికి మించి ఖర్చు చేయడం చివరకు ఆర్థిక సమస్యలకు దారితీస్తోంది. గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయితో పాటు జిల్లా స్థాయికి ఎదిగిన నాయకుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సర్పంచ్, కౌన్సిలర్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, సహకార సంఘాల చైర్మన్ వంటి పదవులతో పాటు నామినేటెడ్ పదవులు పొందిన రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో భారీగా ఖర్చు చేస్తున్నారు. గెలుపు కోసం లక్షల రూపాయలు వెచ్చించిన తర్వాత పదవిని నిలబెట్టుకోవడానికి, రాజకీయ కార్యకలాపాలు కొనసాగించడానికి అదనపు ఖర్చులు తప్పడం లేదు. రాజకీయాల్లో రాణించేది కొద్దిమందే అయినా పదవులపై ఆశతో ఎన్నికల బరిలోకి దిగే సంఖ్య మాత్రం ఎక్కువగానే ఉంటోంది. దర్పం కోసం కారు.. రోజువారీ ఖర్చుల భారం, రోజు గంజి వేసిన తెల్లటి ఖద్దరు చొక్కా, ఖరీదైన పాదరక్షలు, ప్రత్యేకమైన కారు, వెంట అనుచరులు.. రాజకీయ నాయకుడి హోదాకు ఇవన్నీ అవసరమనే భావన పెరుగుతోంది. జేబులో డబ్బు లేకపోయినా హోదాకు తగ్గట్టుగా కనిపించాలి ఒకవేళ అలా అకనిపించకపోతే ఎక్కడ తనని తక్కువ చేసి చూస్తారో అనే ఒత్తిడి ఆర్థిక భారాన్ని పెంచుతోంది.

గతంలో రాజకీయంగా ఓ స్థాయికి ఎదిగి ఆర్థికంగా బలపడిన నాయకులకే కార్లు ఉండేవి ప్రస్తుతం గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు అనేక మంది నాయకులు కార్లను కొనుగోలు చేస్తున్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల ద్వారా వాయిదా పద్ధతిలో రుణాలు లభిస్తుండటంతో కారు కొనుగోలు సులభమైనా, నెలనెలా వాయిదా, ఇంధనం, నిర్వహణ ఖర్చులు అదనపు భారంగా మారుతున్నాయి. పదవి, హోదాను చాటుకునేందుకు కార్లకు రేడియం స్టిక్కర్లు, పార్టీ గుర్తులు ఏర్పాటు చేయడం, లోపల పార్టీ కండువా ఉంచుకోవడం సాధారణంగా మారింది. రాజకీయ కార్యక్రమాలు ఎక్కువగా ఉన్న సమయంలో ఇంధనం, భోజనం, అనుచరుల ఖర్చులు కలిపి రోజుకు రూ. 2వేల నుంచి రూ. 4 వేల వరకు ఖర్చయ్యే పరిస్థితి నెలకొంటోంది. నెలకు రూ. 60వేల నుంచి రూ. 90 వేల వరకు ఖర్చు చేస్తున్న రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. గొప్పలకు పోయి.. అప్పుల పాలై నలుగురి ముందు హోదా తగ్గకూడదనే భావనతో ఆదాయానికి మించి ఖర్చు చేయడం సమస్యకు ప్రధాన కారణంగా మారుతోంది. రాజకీయ కార్యక్రమాలు, సమావేశాలు, పార్టీ కార్యక్రమాలకు వెళ్లేందుకు అయ్యే వ్యయం నిరంతర భారం అవుతోంది. కొంతమందికి పైరవీలు, కాంట్రాక్టులు లేదా ఇతర రాజకీయ అవకాశాల ద్వారా ఆదాయం లభిస్తున్నా, ప్రతి నాయకుడికి అలాంటి మార్గాలు అందుబాటులో ఉండవు. ఆదాయానికి మించిన ఖర్చులు కొనసాగితే అప్పులు పెరుగుతున్నాయి. అప్పులు తీర్చేందుకు ఆస్తులు విక్రయించే పరిస్థితి ఏర్పడుతోంది. పదవి ఉన్నా.. ఆర్థికంగా ఇబ్బందులే

అధికార పార్టీకి చెందిన నాయకుడంటే ఆర్థికంగా బలంగా ఉంటారనే సాధారణ అభిప్రాయం ఉన్నా, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. రాజకీయ కార్యకలాపాలకు పెరుగుతున్న ఖర్చులు, వ్యక్తిగత జీవన వ్యయాలు, ఎన్నికల సమయంలో చేసిన అప్పులు కలసి అనేక మందిపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. రాజకీయాల్లో ఏదో ఒక రోజు పెద్ద స్థాయికి ఎదిగి ఆర్థికంగా స్థిరపడతామనే ఆశతో ప్రస్తుత ఆదాయాన్ని మించి ఖర్చు చేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోవడంతో పాటు అప్పులు పెరిగితే కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింటోంది. రాజకీయాల్లో ఎదగడం, ఆర్థికంగా ఎదగడం రెండూ ఒకటే కాదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పదవి కోసం చేసే ఖర్చుకు హద్దులు లేకపోతే అధికారం వచ్చినా ఆర్థిక ఇబ్బందులు తప్పవనే వాస్తవాన్ని రాజకీయ రంగంలోని పరిణామాలు గుర్తుచేస్తున్నాయి.

## లోది సామాజిక వర్గం సామాజికంగా అభివృద్ధి చెందాలి







**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** లోది సామాజిక వర్గం సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వారిపై ఎలాంటి వివక్ష ఉండకూడదని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. లోది సామాజిక వర్గ సమస్యల అధ్యయనంలో భాగంగా బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మీరంగు పెద్ద శంకరంపేట మండలంలోని లోది కాలనీలో పర్యటించారు.

ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు, ప్రజలను కలిసి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, వృత్తిపరమైన అవకాశాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని వారు కమిషన్‌ను కోరారు.

నిరంజన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అందించిన వినతులు, సూచనలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన నివేదికలు, సిఫార్సులు అందజేస్తామని చెప్పారు.

అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ పెద్ద శంకరంపేట మండలంలోని ఆరేపల్లి, పెద్ద శంకరంపేట, కమలాపూర్ గ్రామాల్లో 43 కుటుంబాలకు చెందిన 179 మంది, రేగోడు మండలం కొత్వాన్‌పల్లిలో 19 కుటుంబాలకు చెందిన 77 మంది లోది సామాజిక వర్గానికి చెందిన వారున్నారని తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన లేక కొందరు ముదిరాజ్ కులంలో ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని చెప్పారు. లోది వర్గానికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించి సామాజికంగా ముందుకు తీసుకెళ్లాలని, వివక్ష లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, లోది సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తుల కంచె








**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలోని అన్ పహాడ్ శివారులో సర్వే నంబర్ 8లో ఉన్న ప్రభుత్వ భూమికి కొందరు వ్యక్తులు కంచె ఏర్పాటు చేయడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ భూమిని గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఆ బోర్డు తొలగించి కంచె ఏర్పాటు చేశారని వారు ఆరోపిస్తున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి స్థల పరిశీలన సందర్భంగా పాఠశాలకు సమీపంలోని ప్రభుత్వ భూమిని వదిలి సుమారు 200 మీటర్ల దూరంలోని క్రీడా మైదానంలో ఎకరం స్థలం కేటాయించే ప్రయత్నం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. క్రీడా మైదానాన్ని ఇతర నిర్మాణాలకు వినియోగించరాదని క్రాంతి క్రీడా అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్ బి. సుగుణ దృష్టికి తీసుకెళ్లడంతో స్థల కేటాయింపు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 8లోనే అదనపు గదుల నిర్మాణానికి సరిపడా స్థలం ఉందని స్థానికులు అంటున్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ సలీంమియా పలుమార్లు సర్వే నిర్వహించి భూమిని ప్రభుత్వ స్థలంగా గుర్తించి బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన బదిలీ అనంతరం బోర్డు తొలగించి కొందరు వ్యక్తులు కంచె ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను సంప్రదించినా స్పందన లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని, భూమి ప్రభుత్వానికి చెందినదిగా తేలితే ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆశ్రమ పాఠశాల అదనపు గదులకు అవసరమైన స్థలాన్ని పాఠశాల సమీపంలోని ప్రభుత్వ భూమిలోనే కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడుతాం: తహసీల్దార్ బి. సుగుణ మాట్లాడుతూ సర్వే నంబర్ 8లోని భూమిని గతంలో తహసీల్దార్ సలీంమియా ప్రభుత్వ స్థలంగా గుర్తించి బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం ఆ భూమి ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోందని, సమస్యను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# కూల్చివేతలు లేకుండా బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తాం

- 80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాల కూల్చివేత అవసరమా?



సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): సంగారెడ్డి పట్టణ బైపాస్ రోడ్డు అభివృద్ధిలో ప్రజలు, వ్యాపారులకు నష్టం కలగకుండా పనులు చేపట్టాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన కాలినడకన పర్యటించి రహదారి పరిస్థితిని పరిశీలించారు. అధికారులతో రహదారి కొలతలు తీయించి అభివృద్ధి పనులపై చర్చించారు.

బైపాస్ రోడ్డు అభివృద్ధికి తాను రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని జగ్గారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే 80 అడుగుల రోడ్డు కోసం భవనాలు కూల్చాలని చెబుతున్నారని, అలా చేస్తే సుమారు 180 భవనాలు తొలగించాల్సి వస్తుందని అన్నారు. భవన యజమానులకు కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించడం సాధ్యమా అని ప్రశ్నించారు.

కూల్చివేతలు లేకుండా 50 అడుగుల రహదారిని అభివృద్ధి చేయవచ్చని, దీంతో ఇళ్లు, దుకాణాలు, మెట్లు తొలగించాల్సిన అవసరం ఉండదన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులు, భవన యజమానులకు నష్టం కలగకుండా, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు.

తాను నిధులు తీసుకొచ్చి పనులు చేపడుతుంటే స్థానిక ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదులు చేసి పనులు అడ్డుకుంటున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. హెచ్ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయని, విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు.

80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే స్థానిక ఎమ్మెల్యే ప్రజల మధ్యకు వచ్చి కూల్చివేతలపై స్పష్టత ఇవ్వాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

## మోదీ పుట్టినరోజున ప్రతి ఇంట దీపం వెలిగించాలి




పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17న సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలని సంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ పిలుపునిచ్చారు. పెద్ద శంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామకృష్ణ, రాజశేఖర్ గౌడ్, శ్రావణ్ కుమార్, బుగుడాల కృష్ణ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



కల్హేర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): కల్హేర్ మండలం ఇంద్రనగర్ తండాకు చెందిన జైపాల్ ఇటీవల వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వారి నివాసానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైపాల్ మృతి బాధాకరమని, బాధిత కుటుంబానికి తాను అండగా ఉంటానని తెలిపారు. ప్రభుత్వం నుండి రావాల్సిన పరిహారం, విద్యుత్ శాఖ నుండి ఎక్స్‌గ్రేషియా అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, సర్పంచ్ సంగన్న, వార్డు సభ్యులు గోపి, నాయకులు విఠల్, నర్సింలు, శ్రీనివాస్, ప్రకాశ్, లక్ష్మణ్ నాయక్, ఓంకార్, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ



నంగునూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): నంగునూరు మండలం తిమ్మాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఇంకుడు గుంత నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి, సర్పంచ్ చేర్యాల రాజు మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను సంరక్షించేందుకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటి ప్రాధాన్యతను గుర్తించి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.35 వేల వరకు అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుశాంత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యుడు మురళి, నాయకులు జంగిటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండన



నంగునూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను **'కల్పిత నాయకుడు'**గా పేర్కొంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి దేశ బహిష్కరణ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించేలా రాసిన పుస్తకాల విడుదలను నిషేధించి, ముద్రించిన ప్రతులను స్వాధీనం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీని కోరారు. రాజ్యాంగ రూపకర్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా ఇంచార్జి లింగాల కృష్ణ, బొంబాయి వెంకట్, సిద్దిని రాజమలయ్య, కేపీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత భూములను ఎత్తివేయాలి



తూప్రాన్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించి, వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరుతూ మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ గారికి మెదక్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అడహాక్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 22-ఏ నిషేధిత జాబితాలో పట్టా భూములు, ఇంటి స్థలాలు ఉండటం వల్ల వాటి రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాయింట్ కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాలలో ఈ సమస్య అధికంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడే ఉద్దేశంతో 22-ఏ నిషేధిత జాబితాలో ప్రభుత్వ భూములను చేర్చడం సమంజసమేనని, అయితే అధికారుల తప్పిదాల కారణంగా ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంవత్సరాలుగా తమ భూములను అనుభవిస్తూ, పట్టాదారు పాస్‌బుక్కు మరియు ఇతర హక్కు పత్రాలు కలిగి ఉన్నప్పటికీ 22-ఏ జాబితాలో ఉండటం వల్ల భూముల రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కావున సంబంధిత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ భూములు కాని ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను 22-ఏ నిషేధిత జాబితాను పరిశీలించి వెంటనే తొలగించి, ప్రజలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గారిని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అడహాక్ కమిటీ నాయకులు ఉప్పలఅశోక్ గుప్త, గుమ్మడి జనార్దన్, మల్లేశం గౌడ్, వాసర సంజీవ్, వీరేశం చారి, సీనియర్ నాయకులు తుంగని సత్యం.

సీనియర్ నాయకులు ఎస్. రవీందర్ గౌడ్, గోపాల్ రావు, సాయిలు, ఎండి కరీం పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే

### బైపాస్ రోడ్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: విజేందర్ రెడ్డి



సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): బైపాస్ రోడ్డు సమస్యపై మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమని మాజీ సీడీసీ చైర్మన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు రామప్ప, కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్ మాట్లాడారు.

బైపాస్ రోడ్డుపై గుంతలు, ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనులు నెమ్మదిగా సాగుతున్నందున సమస్య మరింత తీవ్రమవుతోందన్నారు. రోడ్డు పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించాలన్నదే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ అని పేర్కొన్నారు.

**80, 60 అడుగుల మేర విస్తరణ అవసరం...**

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 80 అడుగుల రోడ్డు ఉన్నచోట 80 అడుగులు, 60 అడుగుల రోడ్డు ఉన్నచోట 60 అడుగుల మేర విస్తరణ చేపట్టాలని విజేందర్ రెడ్డి అన్నారు. హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కేవలం 50 అడుగుల రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదన్నారు. ప్రస్తుతం ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు.

**రాజీవ్ పార్క్ అభివృద్ధిపై ప్రశ్నలు...**

ముగ్గురు ముఖ్యమంత్రులు మారినా సంగారెడ్డిలోని రాజీవ్ పార్క్ పూర్తిస్థాయిలో ఎందుకు అభివృద్ధి కాలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రతి వార్డుకు రూ.8 కోట్ల అభివృద్ధి నిధుల హామీ పరిస్థితిని, సీఎం పర్యటన సందర్భంగా మంజూరైన నిధుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషితో రూ.50 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలు, నాణ్యమైన రోడ్లపై దృష్టి పెట్టాలని సూచించారు.

## యనగండ్లలో దోమల నివారణకు చర్యలు



**కొల్హారం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
కొల్హారం మండలం యనగండ్లలో సర్పంచ్ కోరబోయిన లక్ష్మి పెంటయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా హాజరై గ్రామంలోని ప్రధాన వీధులు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**వెల్దుర్తి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
పోషణ మహోత్సవంలో భాగంగా వెల్దుర్తిలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడీ సూపర్వైజర్ మాధవి హాజరై బాలింతలకు గర్భిణులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది ముఖ్యంగా సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు ఈ పోర్షన్ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందని గర్భిణీలు బాలింతలు క్రమం తప్పకుండా ఈ పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడం జరుగుతుందని క్రమం తప్పకుండా ఈ ఆహారాన్ని సేవించాలని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## అధ్యక్షుడిగా సమీర్ ఎన్నిక



**పాపన్నపేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
పాపన్నపేట విద్యుత్ సబ్ డివిజన్ 1104 యూనియన్ ఎన్నికలు బుధవారం పాపన్నపేటలోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా సమీర్ ఏఎల్ఎం, ఉపాధ్యక్షుడిగా రవీందర్ ఆర్టిజన్, కార్యదర్శిగా ఫణిందర్ ఏఎల్ఎం, అదనపు కార్యదర్శిగా మోహన్ ఆర్టిజన్ ఏకగ్రీవంగా వీరు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు, సభ్యులు.. ప్రసాద్, విట్టల్, శ్రీనివాస్, సంగయ్య, శివరాం నాయక్, రవీందర్ గౌడ్, సుధీర్, ప్రశాంత్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ భాష వైభవాన్ని చాటిన విద్యార్థులు



**కొత్తపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి ఆర్. ఆంజనేయులు, హిందీ ఉపాధ్యాయుడు వెంకట్‌రాములు పాల్గొని విద్యార్థులకు హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వ్యాసరచన, పద్యాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృథాగా పోతున్న తాగునీరు.. పట్టించుకునే నాథుడే లేడు!

- ట్యాంక్ నిండినా మోటార్ బంద్ చేయని వైనం
- రోజూ వేల లీటర్ల నీరు నేలపాలు.. బురదమయంగా మారుతున్న వీధులు
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



**కోహీర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని పర్సపల్లి గ్రామంలో తాగునీటి వృథా అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకర్ నిర్వహణ లోపాలతో నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ పూర్తిగా నిండిపోయిన తర్వాత కూడా మోటార్‌ను నిలిపివేయకపోవడంతో నీరు పొంగిపొర్లుతూ రోడ్లపైకి చేరుతోంది.

**వేల లీటర్లు నేలపాలు...**

ట్యాంకర్ వద్ద సరైన పర్యవేక్షణ లేకపోవడంతో లీకేజీలు, ఓవర్‌ఫ్లో కారణంగా ప్రతిరోజూ వేలాది లీటర్ల విలువైన తాగునీరు వృథాగా పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ట్యాంకర్ నుంచి బయటకు వచ్చిన నీరు గ్రామ వీధుల్లోకి చేరడంతో రోడ్లపై బురద పేరుకుపోతోంది. పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని, దీంతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

**నీటి కోసం ప్రజల తిప్పలు.. ఇక్కడ మాత్రం వృథా!**

ఒకవైపు వేసవి, వర్షాకాల పరిస్థితుల్లోనూ అనేక గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. పర్సపల్లిలో మాత్రం అందుబాటులో ఉన్న నీటిని సైతం నిర్లక్ష్యంతో వృథా చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నీటి పొదుపుపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని విమర్శిస్తున్నారు.

**ఫిర్యాదులు చేసినా స్పందన ఏదీ?**

ట్యాంకర్ నుంచి నీరు వృథాగా పోతున్న విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో నీటి వృథాతో పాటు పారిశుద్ధ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలి**

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మినీ వాటర్ ట్యాంకర్‌కు కంట్రోల్ వాల్వ్ ఏర్పాటు చేయడంతో పాటు లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మోటార్ నిర్వహణపై సిబ్బందికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, ట్యాంకర్ నిండిన వెంటనే మోటార్ నిలిచిపోయేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టి పర్సపల్లి ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆపదలో తోటి సర్పంచ్‌కు అండగా నిలిచిన సర్పంచులు



**నంగునూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అప్పలాయచెరువు సర్పంచ్ పెద్దమ్మల సత్యం కుటుంబానికి నంగునూరు మండల సర్పంచులు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. సత్యం ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో 20 రోజులుగా చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులు భారంగా మారడంతో విషయం తెలుసుకున్న తోటి సర్పంచులు స్పందించి నిధులు సేకరించారు. హైదరాబాద్‌లో ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సత్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం





**కోహెడ, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోహెడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి రాళ్లబండి పద్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోధనా రంగంలో ప్రతిభ కనబరుస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సత్కరించారు. విద్యారంగానికి సేవలందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను కూడా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు బందెల సుజాత, కరివేద చంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎం.సరళ, ఎండి. మహమూద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై వివాదాస్పద పుస్తకాన్ని నిషేధించాలి



**నంగునూరు, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ రాస్తున్న వివాదాస్పద పుస్తకాన్ని వెంటనే నిషేధించాలని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం నంగునూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన అంబేద్కర్‌పై అసత్యాలు, కల్పితాలతో రచనలు చేయడం ఖండించదగిన విషయమన్నారు. సమాజంలో విద్వేషాలు పెంచే అంశాలపై అధికారులు వెంటనే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అవమానకర ప్రచారాన్ని సహించరాదని, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయ స్ఫూర్తిని కాపాడాలని పిలుపునిచ్చారు.

## హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి



**చేర్యాల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిగారి రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం చేర్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ పుస్తకం రాయడం అభ్యంతరకరమన్నారు. పుస్తకాన్ని విడుదల చేయకుండా నిలిపివేసి, 24 గంటల్లో హమారా ప్రసాద్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్‌ను అవమానించడం కోట్లాది ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో భూమిగారి రత్నం, కర్ణాకర్, పాకాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అక్షర గ్రామర్ స్కూల్ వినాయక నిమజ్జనం



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
దేశాయిపల్లి ఎక్స్‌రోడ్‌లోని శ్రీ అక్షర గ్రామర్ స్కూల్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. బుధవారం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి నినాదాల మధ్య శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. విద్యార్థుల సందడి, భక్తిగీతాలు, నామస్మరణలతో పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.ప్రహ్లాద్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ, సోదరభావం, భారతీయ సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై కమిషనర్ కొరడా

- కోహిర్‌లో విస్తృతంగా పనుల తనిఖీ..
- నిర్లక్ష్యంపై కఠిన చర్యల హెచ్చరిక



**కోహిర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

సిబ్బంది పనితీరును తనిఖీ చేసి, లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధులను ప్రతిరోజూ శుభ్రం చేయాలని, రోడ్లకు ఇరువైపులా పేరుకు పోయిన చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి...**
మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ సూచించారు. డ్రైనేజీల్లో నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు దోమల వ్యాప్తి నివారణకు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ...**
ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును కమిషనర్ పరిశీలించారు. చెత్త సేకరణ వాహనాలు నిర్ణీత సమయానికి ప్రతి ఇంటికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

**నిర్లక్ష్యంపై చర్యలు...**
పారిశుద్ధ్య సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన పెన్షన్లపై క్షేత్రస్థాయి విచారణ

- ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం



**కొల్చారం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** కొల్చారం మండలంలో నూతన పెన్షన్ల మంజూరుకు సంబంధించి క్షేత్రస్థాయి విచారణలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఎనిగండ్ల గ్రామంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం పెన్షన్ దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను పరిశీలించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న సమాచారాన్ని దరఖాస్తుదారులను అడిగి సరిచూశారు. అలాగే పరిసర ప్రాంతాల ప్రజలను విచారించి దరఖాస్తుదారుల అర్హతను నిర్ధారించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నూతన పింఛన్ల కోసం వివిధ విభాగాల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం అర్హులైన వారి తుది జాబితాను జిల్లా అధికారులకు పంపిస్తామని చెప్పారు. నిజమైన అర్హులకు నిబంధనల ప్రకారం పెన్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోర బోయిన లక్ష్మి పెంటయ్య, ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్వాన బై ఎస్ ఫోర్ హోటల్ ప్రారంభం





**సదాశివపేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మండలంలోని నందికంది గ్రామ శివారులో రిలయన్స్ పెట్రోల్ పంపు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహ్వాన బై ఎస్ ఫోర్ హోటల్‌ను డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ మాజీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధన్న, మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, నందికంది సర్పంచ్ స్రవంతి విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, నాయకులు చింటూ గౌడ్, నాగరాజు గౌడ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు

- 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్



**సదాశివపేట, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** పట్టణంలోని 19వ వార్డులో శ్రీరామ్ సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొని గణనాథుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు లింగం స్వామి వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామ్ సేన యూత్ సభ్యులు ప్రసాద్ గౌడ్, సాయి కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాము, శివశంకర్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్‌లను అందజేసిన అందె లక్ష్మి



**చేర్యాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** చేర్యాల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులోని రెండో వార్డు పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు స్థానిక వార్డు సభ్యురాలు అందె లక్ష్మి పిల్లల ఇబ్బందులను చూసి వెంటనే తన సొంత ఖర్చుతో బుధవారం ఫ్యాన్ లను బహూకరించారు. ఈ సందర్భంగా అందె లక్ష్మి మాట్లాడుతూ.. చిన్నపిల్లల ఇబ్బందులను చూసి వారికి ఎలాగైనా సహాయం చేయాలని సర్పంచ్ తో మాట్లాడి రెండు అంగన్వాడీ కేంద్రాలకు సరిపోయే విధంగా ఫ్యాన్ లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము రవి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, అంగన్ వాడి టీచర్లు ఉల్లెంగల ప్రణీత, అనుముల విజయ పాల్గొన్నారు. వార్డు సభ్యురాలు అందె లక్ష్మీ ని సర్పంచ్, గ్రామస్తులు, అంగన్వాడీ టీచర్లు, అభినందించారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

- సెప్టెంబర్ 17ను అధికారికంగా సాయుధ పోరాట దినోత్సవంగా నిర్వహించాలి
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ. రెహమాన్





**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ. రెహమాన్ అన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని నారాయణరెడ్డి కాలనీ, మార్క్స్‌నగర్‌లో బుధవారం ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, చాకలి ఐలమ్మ తదితరుల నాయకత్వంలో రైతాంగ పోరాటం సాగించిన్నారు.

కుల, మతాలకు అతీతంగా సాగిన ఈ పోరాటాన్ని కేవలం హిందూ--ముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం ద్వారా చరిత్రను వక్రీకరించవద్దని ఆయన అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన పోరాటం ఫలితంగా వేలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందని, అనేక గ్రామాలు విముక్తి పొందాయని తెలిపారు.

ఈ పోరాటంలో కమ్యూనిస్టు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి గుర్తింపు వస్తుందనే కారణంతో గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు సెప్టెంబర్ 17కు వివిధ పేర్లు పెట్టి నిర్వహించడం సరికాదని విమర్శించారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా సాయుధ పోరాట దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వారోత్సవాల ముగింపు సభ సెప్టెంబర్ 17న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బి. వెంకట్రాజ్యం, కాశీనాథ్, టీ. సంతోష్‌కుమార్ గుప్తా, ఫెరోజ్, వరలత, రజియాబీ, బిపాషా, అక్తర్‌బీ, యాదమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి సీసీటీవీ భద్రత

- సొంత నిధులతో 8 కెమెరాల ఏర్పాటు
- రోగులు, మహిళా సిబ్బందికి మరింత భద్రత
- కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముజాఫర్ హుస్సేన్



**కోహిర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముజాఫర్ హుస్సేన్ ముందుకు వచ్చారు. తన సొంత నిధులతో ఆసుపత్రిలో ఎనిమిది సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా వ్యవస్థను స్థానిక నాయకులు, వైద్యాధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఆసుపత్రి ప్రాంగణంలోని ప్రధాన విభాగాలు, కీలక ప్రాంతాలను కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చారు. కెమెరాల దృశ్యాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటర్ స్క్రీన్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది రాకపోకలపై నిఘా ఉంచే అవకాశం ఏర్పడింది.

ముఖ్యంగా మహిళా వైద్య సిబ్బంది, రోగులకు భద్రత కల్పించడంతో పాటు ఆసుపత్రి ప్రాంగణంలో అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయని వైద్యాధికారులు తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సిబ్బంది విధుల నిర్వహణను పర్యవేక్షించేందుకు కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముజాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆసుపత్రికి అవసరమైన మరిన్ని మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఆసుపత్రికి అవసరమైన భద్రతా నిఘా వ్యవస్థను సొంత నిధులతో సమకూర్చినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, సిబ్బంది ముజాఫర్ హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ రంగ ఆసుపత్రికి సామాజిక దృక్పథంతో సహకారం అందించడాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు అభినందించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, కోహిర్ ఎస్ఐ నరేష్, వైస్ చైర్మన్ అన్వర్ జావీద్, కౌన్సిలర్లు అనసూయ, జగదీశ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ పథకాల అమలుపై సమీక్ష

- క్షేత్రస్థాయిలో పర్యటించాలి: ఏడిఏ రామకృష్ణ



**మద్దూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** వ్యవసాయ శాఖ పథకాల అమలును వేగవంతం చేయాలని కోస్గి వ్యవసాయ సహాయ సంచాలకులు ఏడిఏ రామకృష్ణ సూచించారు. మద్దూర్, కొత్తపల్లి మండలాల వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. వనమహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ఎంఏఓ, ఏఈఓలు గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో మద్దూరు ఎంఏఓఏ ప్రవీణ్ కుమార్ కొత్తపల్లి ఎంఏఓ కే.రమేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్‌కు ఎంపికైన నిడ్జింత విద్యార్థిని



**కొత్తపల్లి సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన కమ్మరి గోపాల్ చారి కూతురు అపూర్వ నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి వరంగల్ లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.
ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

## నవాబ్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో పతాకావిష్కరణ

**నవాబ్‌పేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల (G.O. Rt No. 1345, తేదీ: 16.09.2026) ప్రకారం.. నాడు (గురువారం, సెప్టెంబర్ 17) 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం' సందర్భాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నవాబ్‌పేట ఎం.పీ.డీ.ఓ (M.P.D.O) ఒక ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 9:00 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ఈ పతాకావిష్కరణ మహోత్సవంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, నాయకులు మరియు ప్రజలు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఎం.పీ.డీ.ఓ కోరారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను సందర్శించిన ఏఐటీయూసీ నేతలు



**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, హైకోర్టు అడ్వకేట్ సంతోష్‌నాయక్ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి నెలా హెల్త్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ నుంచి పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు రోజూ ఆరు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని తెలిపారు. పాఠశాల సమయాల్లో ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సంతోష్‌నాయక్ సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఆర్ బాల గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు



**సదాశివపేట, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** పట్టణంలోని గురునగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పీఎంఆర్ బాల గణేష్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మల-రమేష్ దంపతులు నిర్వహించిన పూజల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో అపర్ణ-రమేష్ దంపతులు తొలి లడ్డూను దక్కించుకున్నారు. వారికి మమత శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు మమత తెలిపారు. కార్యక్రమంలో గంట శివన్న, శంకరమ్మ, గోపిప్రియాంక, కనిగిరి అనురాధ శంకర్, సంధ్య బస్వరాజ్, రాధమ్మ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వినాయకుల నిమజ్జన కొలనుల ప్రారంభం



**జడ్చర్ల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలో చిన్న వినాయకుల నిమజ్జన కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తుల సౌకర్యార్థం మున్సిపాలిటీ అధికారులు ప్రధాన ప్రాంతాలలో తాత్కాలిక నిమజ్జన కొలనులను (పాండ్స్) అందుబాటులోకి తెచ్చారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద, హౌసింగ్ బోర్డ్, బీసీ హాస్టల్ వెనుక ఉన్న కల్వకుర్తి రోడ్ పార్కు ప్రాంగణంలో తాత్కాలిక నిమజ్జన కొలనులను సిద్ధం చేశారు. ఈ తాత్కాలిక నిమజ్జన కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ గిరీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ చిన్న వినాయక విగ్రహాలను తాత్కాలిక కొలనులోనే నిమజ్జనం చేసి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మీపతి, మేనేజర్ లక్ష్మన్న, అసిస్టెంట్ ఇంజనీర్ గాయత్రి, రెవెన్యూ ఆఫీసర్ సలాం, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నాగేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా హరీష్ యాదవ్



**కొండాపూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా గంగయోళ్ల హరీష్ యాదవ్‌ను నియమించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఆయన చేతుల మీదుగా హరీష్ నియామక పత్రం అందుకున్నారు. తోగర్‌పల్లి గ్రామానికి చెందిన హరీష్ నియామకంపై బీసీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్, ప్రధాన కార్యదర్శి సిరిగిరి కృష్ణమూర్తి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కార్తీక్ పటేల్‌కు హరీష్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీ యువతను సంఘటితం చేసి వారి హక్కుల కోసం కృషి చేస్తానన్నారు.

## డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలను వంచించొద్దు



**తూప్రాన్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** యూపీఐ చెల్లింపులపై కొత్తగా ఎండీఆర్ విధానాన్ని తీసుకు రావడాన్ని బీఆర్ఎస్ నాయకుడు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ విమర్శించారు. రూ.2,000కు పైబడిన కొన్ని వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించే నిబంధనలు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ భారాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపే అవకాశం ఉందని, దాంతో ధరలు పెరిగే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని పునఃపరిశీలించి సామాన్య ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం



**తెలకపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** తల్లి, బిడ్డ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సునీత, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా నడిగడ్డ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం ప్రోటీన్లు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో సమతుల్య ఆహారం అందించాలని సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని తెలిపారు. చిన్నారుల బరువు, ఎత్తును అంగన్వాడీ కేంద్రాల్లో పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## మక్తల్ మండలంలో నేటి నుంచి పింఛన్ల తనిఖీ

### 7 గురు అధికారుల నియామకం

**మక్తల్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మక్తల్ మండల పరిధిలో చేయూత పింఛన్ల తనిఖీ (వెరిఫికేషన్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ తనిఖీ కార్యక్రమం సెప్టెంబర్ 17, 2026 బుధవారం నుంచి అధికారికంగా ప్రారంభం కానుంది. మండలంలో అర్హులైన వారికే పింఛన్లు అందుతున్నాయా లేదా అనే కోణంలో ఈ పరిశీలన జరగనుంది. ఈ తనిఖీ ప్రక్రియ సజావుగా సాగేందుకు మండల వ్యాప్తంగా ఏడుగురు (7) ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పింఛనుదారులు, సంబంధిత లబ్ధిదారులు ఈ తనిఖీ ప్రక్రియకు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు కోరారు. తనిఖీ సమయంలో లబ్ధిదారులు తమ ఆధార్ కార్డులు మరియు సంబంధిత ధృవపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం

- దేశ ఐక్యత కోసం సుదీర్ఘ పాదయాత్ర అభినందనీయం: నీలం మధు






**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రతి కార్యకర్త ఇందుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లుకు పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముత్తంగి ఔటర్ రింగ్‌రోడ్ వద్ద స్వాగతం పలికి, పీఎస్ఆర్ గార్డెన్స్‌లో శాలువాతో సత్కరించారు.
కాటూరి వెంకటేశ్వర్లు జూన్ 19న కన్యాకుమారి నుంచి యాత్ర ప్రారంభించి తమిళనాడు, కేరళ, కర్ణాటక మీదుగా ఇప్పటివరకు 1,500 కిలోమీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించి పటాన్‌చెరుకు చేరుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ యాత్ర కొనసాగిస్తున్నారు.
ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ యువతకు ఉపాధి, రైతులకు భరోసా, మహిళలకు సమాన అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగడం ప్రజాస్వామ్యానికి ముఖ్యమన్నారు. దేశ ఐక్యత, సోదరభావం, సామాజిక న్యాయం కోసం ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.
వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టిన కాటూరి వెంకటేశ్వర్లును అభినందించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొల్కురి నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కెసిఆర్ భూములపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

- సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ
- పట్టణం అధ్యక్షుడు అత్తుఇమామ్



సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): కెసిఆర్ భూములపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడం హర్షించదగ్గదని కెసిఆర్ వందల ఎకరాల భూములపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం వారు మాట్లాడుతూ.. 22ఏ పై బిఆరెస్ నాయకులు అబద్దం మాటలు మాట్లాడుతూ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. 22ఏ మీద బిఆరెస్ నాయకులు చేస్తున్న అబద్దం మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తాం అని చెప్పి కెసిఆర్ మోసం చేశారని గుర్తు చేశారు. 10 సంవత్సరాలలో దళితులకు 3 ఇకరాలు కాదుకదా 1 ఎకరం ఇవ్వలేదు అని 10 సంవత్సరాలలో కెసిఆర్ కు అంత భూమి ఎక్కడిదని అన్నారు. అన్ని వందల ఎకరాలు కెసిఆర్ ఎం వ్యాపారం చేసి కొన్నారో దమ్ముంటే ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. ఉద్యమం పేరుతో ముఖ్యమంత్రి అయిన తరువాత కెసిఆర్ వందల ఎకరాలు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబసభ్యులు ఏమెల్యే హరీష్ రావు ఆస్తుల మీద విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించాలి అని అన్నారు. ప్రభుత్వ భూమి ఉంటే వాటిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఎర్రావల్లిలో భూ యజమానులను బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాటిని తిరిగి భూమి యజమానులకు అప్పగించాలని అన్నారు. కెసిఆర్ అక్రమంగా ఆస్తులు కొడగట్టితే వాటిని నిరుపేదలకు పంచి పెట్టాలి అని అన్నారు. అధికారం ఉందని కెసిఆర్ 10 సంవత్సరాలు లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. 10 సంవత్సరాలు అక్రమంగా దోచుకున్న సొమ్మును నయా పైసాతో సహా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్కిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, దాసం అంజయ్య, కలీముద్దీన్, బర్మా రాజేంద్రన్, గయాజుద్దీన్, వహాజ్, రషద్, సంతోషి, విజయ్, డానియల్, సీత, బాలు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష



సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు తెలిపారు. మంగళవారం రాత్రి వాహనాల తనిఖీల్లో ముగ్గురు లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతున్న మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వారిని స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా, విచారణ అనంతరం రెండు రోజుల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. శిక్షపడిన వారిలో యటాకర్ల శ్రీనివాస్, మహమ్మద్ షఫీ, ఆలూరి లక్ష్మయ్య, ఎస్. పర్శరాములు ఉన్నారు. మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సీఐ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## అమరచింతకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని వినతి



అమరచింత, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): అమరచింత మున్సిపాలిటీ కేంద్రానికి వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాలు, టీజీ టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు నాయకులు ఈ వినతి చేశారు. ప్రయాణికులు, విద్యార్థుల ఇబ్బందులను మంత్రి ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని సూచించారు. వనపర్తి నుంచి వచ్చే బస్సులను ఆత్మకూరు మీదుగా అమరచింత వరకు పొడిగించాలని కోరారు. చింతరెడ్డి పల్లి-నందిమల్ల-అమరచింత మీదుగా వనపర్తికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపాలని, నారాయణపేట-మరికల్-అమరచింత సర్వీసులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ నుంచి అమరచింతకు రాత్రి 8 గంటల చివరి బస్సును పునరుద్ధరించడంతో పాటు, జూరాల బస్సులను అమరచింత మీదుగా నడపాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జి.రాజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు టి.రవికాంత్, చైర్‌పర్సన్ జింక సువర్ణ రవియాదవ్, వైస్ చైర్‌పర్సన్ ఎస్.రాధ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు



మక్తల్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) : నిజామాబాద్ వేదికగా ఈ నెల 25 నుండి 27 వరకు జరగనున్న అస్మిత ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి 5 కి.మీ. రోడ్డు సైకిల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 36 మంది బాలికలు, 9 మంది మహిళా పిఈటీలు పాల్గొననున్నట్లు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. బాలికలు 2008-2011 మధ్య, మహిళలు 2007 కంటే ముందు జన్మించినవారు అర్హులు. బోనఫైడ్, టెన్త్ మెమో, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో. సెప్టెంబర్ 20, 2026 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 77027131 నంబర్‌ను సంప్రదించగలరు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన శ్రీహాసినికి ఘన సన్మానం



బాలానగర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన గౌతాపూర్ గ్రామానికి చెందిన వెలిజర్ల శ్రీహాసినికి గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. మాజీ ఉపసర్పంచ్ వెలిజర్ల కవిత, సుధాకర్‌రెడ్డి దంపతుల కుమార్తె శ్రీహాసిని నాగోల్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ బైపీసీ పూర్తి చేసి సెప్టెంబర్ 15న ఎంబీబీఎస్ సీటు సాధించింది. చిన్నప్పటి నుంచే డాక్టర్ కావాలన్న ఆమె కల నెరవేరడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆమెను శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి అభినందించారు. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని యువతకు సూచించారు.

## దళిత మహిళను మోసం చేసిన బీఆర్ఎస్ నేత కుమారుడు

- అక్టోబర్ 2న చలో చిట్యాల



మక్తల్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): దళిత యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకొని కులం పేరుతో ఆమెను వదిలించుకోవాలని చూస్తున్న చిట్యాల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు మారుతి గౌడ్ కుమారుడు సత్యం గౌడ్ వైఖరిని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ స్నేహం, పెళ్లి సమయంలో లేని కులం.. కాపురం చేసేటప్పుడు ఎలా అడ్డొస్తుందని నిలదీశారు. ఈ నెల చివరి నాటికి సత్యం గౌడ్ ఆ యువతిని తన ఇంటికి తీసుకెళ్లి కాపురానికి ఉంచుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలతో కలిసి శాంతియుత మార్గంలో బాధితురాలిని సత్యం గౌడ్ ఇంట్లో వదిలిపెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షులు డి.చంద్రశేఖర్, మద్దిలేటి, పృథ్వీరాజ్, నాగేష్ మాదిగ, దండు వెంకటయ్య, బొప్పలి వెంకటేష్, సావిత్రమ్మ, బ్యాగరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని 6 ఇసుక టిప్పర్లు పోలీసులకు అప్పగింత



తెలకపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు అనుమానించిన ఆరు టిప్పర్లను బీజేపీ మండల నాయకులు తనిఖీ చేసి పోలీసులకు అప్పగించారు. మండల అధ్యక్షుడు మంద చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాసులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ చర్య చేపట్టారు. అనుమానాస్పద వాహనాలను గుర్తించిన శ్రీనివాసులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాల అనుమతులు, ఇసుక రవాణా పత్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని శ్రీనివాసులు కోరారు.

## లక్కారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- పాఠశాలకు నూతన భవనం కోసం ఎమ్మెల్సీకి వినతి



తెలకపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): మండలంలోని లక్కారం గ్రామంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దూల సువర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూచకుల దామోదర్‌రెడ్డి హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
లక్కారం-రాకొండ బీటీ రోడ్డు ఏర్పాటుకు సహకరిస్తానని, పాఠశాల కిచెన్ షెడ్ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. కాగా, గ్రామ యువకుడు దాసర్ల శరత్ ఆధ్వర్యంలో యువకులు పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ పరిశీలించి, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని, నూతన భవనం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ముగిసిన బాలికల క్రీడలు.. నేటి నుంచి బాలుర పోటీలు



జడ్చర్ల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): 70వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జడ్చర్ల అర్బన్ మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు బుధవారం బాదేపల్లి జడ్పీహెచ్ఎస్ (బాలుర) మైదానంలో ఘనంగా ముగిసాయి. పోటీలను ఎంఈఓ కె.మంజులాదేవి, జీహెచ్ఎం చంద్రకళ, పిఈటి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన అండర్-14, అండర్-17 విభాగాలు ఖో-ఖో పోటీలలో ప్రేరణ స్కూల్ విజేతగా నిలవగా, టిమ్రీస్ రన్నరప్‌గా నిలిచింది. వాలీబాల్ అండర్-14 విభాగంలో ప్రేరణ స్కూల్ విజేతగా, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ (బాదేపల్లి) రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్-17 విభాగంలో టిమ్రీస్ విజేతగా, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ (బాదేపల్లి) రన్నరప్‌గా నిలిచాయి. కబడ్డీ అండర్-14 విభాగంలో టిమ్రీస్ విజేతగా, పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ (కావేరమ్మపేట) రన్నరప్‌గా సాధించగా, కబడ్డీ అండర్-17 విభాగంలో టిమ్రీస్ విజేతగా, సెయింట్ ఆగ్నెస్ స్కూల్ రన్నరప్‌గా నిలిచాయి. ఈరోజు ఉదయం 9 గంటలకు బాలుర విభాగం పోటీలు ప్రారంభమవుతాయని, అర్బన్ పరిధిలోని జట్లన్నీ సమయానికి హాజరుకావాలని నిర్వాహకులు కళ్యాణ్ జి తెలిపారు.

# తెలంగాణకు 2 లక్షల ఇళ్ల మంజూరు...ప్రధాని మోదీకి బీజేపీ కృతజ్ఞతలు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ బీజేపీ నాయకులు వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా దేశవ్యాప్తంగా గృహ నిర్మాణానికి సహకరిస్తోందన్నారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఇందిరమ్మ ఇళ్ల, రాజీవ్ గృహకల్ప, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వంటి పేర్లు పెట్టి ప్రజలకు అందించాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ పేరు, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ప్రజలకు స్పష్టంగా తెలిసేలా వివరాలను ప్రదర్శించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న ఇళ్లపై పథకం పేరు, కేంద్రం అందిస్తున్న నిధుల వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర పథకాల పేర్లను మార్చడం మానుకోవాలని రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాషటి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు కల్పన, మాజీ పార్లమెంట్ నాయకుడు దాసరాజుల ప్రవీణ్, బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, మాజీ దళిత మోర్చా నాయకులు కుమార్ బాబురావు, దళిత మోర్చా అధ్యక్షులు గంధం ప్రవీణ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కవిత, యువ మోర్చా అధ్యక్షులు నల్లవత్తుల అరవింద్, 13వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి కొండోజ్ గోపీనాథ్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఖలీల్, తిరుపత యాదవ్, చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమరచింత పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్



**అమరచింత, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** అమరచింత డీఎంఆర్ ఆసుపత్రిని డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ బుధవారం పరిశీలించారు. ఆగస్టు 31న ఆసుపత్రిని పీహెచ్‌సీగా గుర్తించి 24 గంటల వైద్య సేవలు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడగా, ఆసుపత్రిని పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు బుధవారం సందర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీఎస్ గోపి, మండల కార్యదర్శివర్గ సభ్యుడు, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్.అజయ్ డీఎంహెచ్‌వోను కలిసి 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం ఏడుగురు వైద్యులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసినందున వెంటనే విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రికి త్వరలో తగిన వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి కూడా సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.

## వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి




**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
ఆగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రవితేజరెడ్డి సోషల్ మీడియాలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకుడు మున్నూరు జయకర్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఖిల్లా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆగారం గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్, ఎంపీడీవో, ఎంపీవోలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు జయకర్ తెలిపారు. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినందుకే తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

తాను ఎవరి విధులకు ఆటంకం కలిగించలేదని, వ్యక్తిగత దూషణలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. తన వద్ద సమస్యలకు సంబంధించిన ఫొటోలు, గ్రామ గ్రూపులో కార్యదర్శి మాట్లాడినట్లు పేర్కొంటున్న ఆడియోలు ఉన్నాయని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## తెలంగాణకు రెండు లక్షల ఇళ్ల మంజూరు



**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా తెలంగాణకు రెండు లక్షల ఇళ్లు మంజూరు చేయడం అభినందనీయమని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రయాణికుల ప్రాంగణంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పేదలకు ఉపయోగకరమైన ఈ పథకాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని బుచ్చిబాబు గౌడ్ కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు దాసర్ల సత్యనారాయణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరమేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులు దశరథం, కొరిగెల గోపి ముదిరాజ్, బాలస్వామి, ఆంజనేయులు, సాయి, మహేష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలస్థాయి బాలికల క్రీడా పోటీలు

- ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస
- విద్యార్థులకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు: చైర్‌పర్సన్



**మక్తల్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో విద్యార్థినుల కోసం మండల స్థాయి అండర్-14, అండర్-17 బాలికల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారిణులను ఆప్యాయంగా పరిచయం చేసుకుని, పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం చైర్‌పర్సన్ వాకిటి మానస మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా, విద్యార్థులు క్రీడల్లోనూ సమానంగా ఆసక్తి చూపించి తమ దాగివున్న ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మండల స్థాయి క్రీడా పోటీల్లో మక్తల్ మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పెద్ద ఎత్తున, అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఖాజా అమీరొద్దీన్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, క్రీడా శిక్షకులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

## మిల్క్‌మియాన్‌పల్లిలో యూరియా బస్తాల చోరీ

- ఖిల్లా ఠాణాలో పిర్యాదు

**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని మిల్క్‌మియాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి పొలంలో యూరియా బస్తాలు చోరీకి గురయ్యాయి. గత నెల 29వ తేదీన రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తన పొలంలో ఉన్న యూరియా బస్తాలను చోరీ చేశారని రైతు తెలిపారు. అయితే అప్పట్లో ఎవరిపై అనుమానం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. మంగళవారం గ్రామంలో యూరియా బస్తాల చోరీ విషయమై కొందరు చర్చించుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి స్పందిస్తూ.. ఆగస్టు 29వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రెండు యూరియా బస్తాలను తీసుకెళ్లడం తాను చూశానని తెలిపాడు.

దీంతో రైతు వెంకట్‌రెడ్డి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేసి తదుపరి వివరాలు తెలుపుతామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## CEIR ద్వారా పోగొట్టుకున్న మొబైల్ రికవరీ




**నవాబుపేట్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను CEIR పోర్టల్ సాయంతో పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. పోమల్ గ్రామానికి చెందిన కొందుటి రామకృష్ణ ఏప్రిల్ 10న పోమల్ నుంచి కొల్లూర్‌కు వెళుండగా ఫోన్ పోగొట్టుకున్నాడు. దీనిపై నవాబుపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు CEIRలో ఫోన్ వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫోన్ హైదరాబాద్ హఫీజ్‌పేటలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. బుధవారం రామకృష్ణకు ఫోన్‌ను అందజేయగా ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ వాకిటి నరేందర్ మాట్లాడుతూ మొబైల్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జజు×= ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేసి, ట్రేస్ చేసి రికవరీ చేయవచ్చని తెలిపారు.

## పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- శేరి వరిగుంతం అంగన్వాడి సెంటర్లో అవగాహన కార్యక్రమం
- మెదక్ ఏసిడిపివో సల్మా సుల్తానా



**కొల్చారం, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెదక్ ఏసీడీపీవో సల్మా సుల్తానా సూచించారు. పోషణ మాసం సందర్భంగా బుధవారం మెదక్ జిల్లా కొల్చారం మండలం సేరి వరిగుంతం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలను ప్రతిరోజూ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో తలెత్తే అనారోగ్య సమస్యలను వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సూపర్‌వైజర్ మంజుల, ఏఎన్ఎం ప్రవీణ, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు గణేష్, అంగన్వాడీ టీచర్లు కే.కవిత, చంద్రకళ, అందనగరం సువర్ణ, భారతి బాయి, పనిత, అంగన్వాడీ హెల్పర్లు మమత, జ్యోతి, దండు ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు ఇప్పించలేని సర్పంచ్ పదవి ఎందుకు?

- **రాజీనామాకు సిద్ధమన్న సర్పంచులు.. అధికారులతో వాగ్వాదం**





**చిన్నంబావి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులకు గ్రామాల్లోని పేదలకు ఇళ్లు మంజూరు చేయించే అధికారం లేకపోతే సర్పంచ్ పదవిలో కొనసాగడం ఎందుకని పలువురు సర్పంచులు ప్రశ్నించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే విషయంలో తమకు నిర్ణయాధికారం లేకుండా చేయడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే సర్పంచ్ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. చిన్నంబావి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం చిన్నంబావి మండల కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో సొంత ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో సర్పంచుల పాత్రను పరిమితం చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఓట్లు వేసి సర్పంచులుగా ఎన్నుకున్నారని, అయితే గ్రామాల్లోని పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో తమకు తగిన అధికారం లేకపోతే ప్రజలకు ఏ విధంగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అధికారపక్షానికి చెందిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ, ఇతర ప్రజాప్రతినిధులను, సర్పంచులను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కొందరు సర్పంచులు ఆరోపించారు. గ్రామాల్లో పేదలు ఇళ్ల కోసం తమను సంప్రదిస్తున్నారని, వారికి న్యాయం చేయలేకపోవడం తమను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ అంశంపై సమావేశంలో సర్పంచులు, ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్ మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు అధికారాలు లేకుండా కేవలం పదవిలో కొనసాగడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తూ, పేదలకు ఇళ్లు మంజూరు చేసే విషయంలో తమకు తగిన అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే సర్పంచ్ పదవులకు రాజీనామా చేస్తామని పలువురు సర్పంచులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదర్శ గౌడ్, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- **సూపర్వైజర్ అమ్మక్క**



**కృష్ణ, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లాలో మక్తల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టులో (గిరిజన ప్రాంత వారికి మాత్రమే) భర్తీ చేయడానికి అర్హులైన మహిళ అభ్యర్థులు ఉంచి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూపర్వైజర్ అమ్మాక్క ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీలు, అర్హత సంబందించిన పూర్తి వివరాలు కోసము వెబ్సై టుకు సందర్శించి ఈ నెల 15 నుండి 30 వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కృష్ణ మండలం గుడేబల్లూర్ అంగన్వాడి కేంద్రం 3, అంగన్వాడి టీచర్, ఆలంపల్లి అంగన్వాడి కేంద్రం 3, టీచర్ కావాలని, ఐనాపూర్ అంగన్వాడి కేంద్రం 1, టీచర్గా కావాలని తెలిపారు.

## బైరాన్‌పల్లి అమరుల త్యాగాలను వృథా కానివ్వం



**చేర్యాల/ధూల్మిట్ట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాటంలో బైరాన్‌పల్లి ప్రజల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. పోరాట 78వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం బైరాన్ పల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. అమరవీరుల స్థూపం, చారిత్రక బురుజు వద్ద పూలమాలలు వేసి అనంతరం నిర్వహించిన సమావేశంలో అశోక్ మాట్లాడారు.

నిజాం పాలనకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లి ప్రజలు సాగించిన పోరాటం, 118 మంది అమరుల త్యాగాల చరిత్రను భావితరాలకు తెలియజేయాలని అన్నారు. బైరాన్‌పల్లి, నల్గొండ జిల్లా గుండ్రాంపల్లి వంటి పోరాట కేంద్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి స్మారక చిహ్నాలుగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. అలాగే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. దొడ్డి కొమురయ్య నుంచి వేలాది మంది యోధులు సాగించిన పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని అశోక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికార లాంఛనాలతో నిర్వహించాలి



**చేర్యాల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికార లాంఛనాలతో నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా అధికారికంగా నిర్వహిస్తోంది.

ఈ సందర్భంగా సంజీవులు మాట్లాడుతూ, తెలంగాణలోనూ సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారికంగా నిర్వహించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలని కోరారు. అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.మహేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, కాసేటి పందు, మన్నె సత్యవర్ధన్, తౌట బాలరాజు, మడికొండ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలి

- **జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**




**జడ్చర్ల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** అక్రమ మద్యం, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు సమర్థవంతంగా కృషి చేసి వాటిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సి. హెచ్. చంద్రశేఖర్ బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి విధుల్లో చేరినట్లు నివేదించారు. సీఐ చంద్రశేఖర్‌ను అభినందించిన కలెక్టర్, విధులను పూర్తి బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నిబంధనలను క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలు చేస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం, మత్తు పదార్థాల నిరోధానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఎక్సైజ్ నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్, ఎంఈఓ




**తెలకపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను గ్రామ సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు, ఇంకుడు గుంత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ బాలరాజును కోరారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆకుకూర పప్పు, కోడిగుడ్డు అందిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా పాఠశాల వాతావరణంలో ఆత్మీయత నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్ బాబు, సింగిల్ విండో డైరెక్టర్ యాదయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన దారా భాస్కర్



**జడ్చర్ల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీపీసీసీ కో-ఆర్డినేటర్ దారా భాస్కర్ బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావాలని దారా భాస్కర్ ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని కోరారు. రాబోయే రోజుల్లో మహేష్ కుమార్ గౌడ్‌కు మరిన్ని ఉన్నత బాధ్యతలు, విజయాలు చేకూరాలని శుభాకాంక్షలు తెలిపారు.

## రెనివట్లలో ఉర్సు షరీఫ్



**మద్దూర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామంలో హజ్రత్ సయ్యద్ షా ఫకీర్ మొహియొద్దీన్ ఖాద్రి హాఫిజ్ రహమతుల్లా అలైహి ఉర్ఫ్ రగ్ కట్టె సాహెబ్ దాదా ఉర్సు షరీఫ్ కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ నెల 17న గురువారం రాత్రి 11 గంటలకు ఇషా నమాజ్ అనంతరం గంధం ఊరేగింపు, గంధం కార్యక్రమం నిర్వహించనున్నారు.

18న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రెట్టపట్ల కార్యక్రమం జరుగుతుంది. ఇందులో ముగ్గురిని ఓడించిన వారికి మూడు తులాల వెండి కడియం, కొబ్బరికాయ, నలుగురిని ఓడించిన వారికి ఐదు తులాల వెండి కడియం, అనంతరం ముగ్గురిని ఓడించిన వారికి వెండి ఉంగరం, కొబ్బరికాయ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

అదే రోజు ఉర్సు షరీఫ్ దీపాలు, ప్రసంగ కార్యక్రమం నిర్వహించనున్నారు. సయ్యద్ కుత్బుద్దీన్ ఖాద్రి, సయ్యద్ తఖి ఖాద్రి ప్రసంగిస్తారు. 19న శనివారం జియారత్, ప్రసాదాల పంపిణీ కార్యక్రమం ఉంటుంది.

ఉర్సు షరీఫ్‌కు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహాత్ముని దర్శించుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమాల నిర్వహణలో ఎం.డి. చోటుమియా, ఎం.డి. ఇస్మాయిల్, ఎం.డి. ఖుత్బుద్దీన్ తదితరులు పాల్గొంటున్నారు.

## ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు.. అన్నదానం



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి వినాయక విగ్రహానికి బుధవారం అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులను డీఎస్పీ మహేష్ శాలువాలతో సన్మానించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయక చవితిని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు, అనుమానాస్పద ఘటనలు ఉంటే డయల్ 112 లేదా 24ఐ7 కంట్రోల్ రూమ్ 8712670399కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**నారాయణపేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మాజీ డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో నర్సిరెడ్డి చౌరస్తాలో 300 మంది రైతులను శాలువాలతో సన్మానించి, అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరి నారాయణ్ భట్టాడ్, అధ్యక్షుడు రవికుమార్‌గౌడ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సాగునీటి కోసం శివకుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల కోసం భూ నష్టపరిహారం ఎకరాకు రూ.20 లక్షలు ఇప్పించారని తెలిపారు. కార్యక్రమంలో కోన మోహన్, భీం చందర్‌గౌడ్, శ్రీనివాస్ లాహోటి, డాక్టర్ సచిన్, లిఖి రఘు, మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**మంతన్‌గౌడ్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మక్తల్ మండలం మంతన్‌గౌడ్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 9న జరగాల్సిన కార్యక్రమం 8వ తరగతి విద్యార్థిని అక్షర మృతితో వాయిదా పడింది. ఆమె స్మృతికి కార్యక్రమానికి 'అక్షర వేదిక'గా నామకరణం చేశారు. సర్పంచ్ రాజేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా, నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రయ్య ముఖ్యవక్తగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. విద్యార్థుల రచనలతో పుస్తకం ప్రచురిస్తామని తెలిపారు. కాళోజీ జీవితం ఆదర్శమని ప్రొఫెసర్ చంద్రయ్య అన్నారు. విద్యార్థుల కవితా గానాలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు, ఏఈఓ సాయి సుధ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ విమోచన, ప్రధాని జన్మదిన ఉత్సవాలు

- **బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్**



**నారాయణపేట, సెప్టెంబర్ 16(జనం సాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బిజెపి అధ్యక్షుడు కొండా సత్యయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విమోచన దినోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గొడు గుగేరి అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సాయంత్రం 6గంటల నుంచి 7 గంటలవరకు ప్రతి ఇంటా సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కవల చిన్నారుల వినాయక భక్తి.. రిమోట్ కారులో నిమజ్జన యాత్ర



**రామాయంపేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** రామాయంపేట పట్టణానికి చెందిన లాల నరేష్ కవల కుమార్తెలు మూడు రోజులుగా స్వగృహంలో విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. బుధవారం సాయంత్రం వినాయకుడిని నిమజ్జనానికి తరలించే సమయంలో చిన్నారుల మారుతి రిమోట్ కారులో విగ్రహాన్ని అలంకరించి, భక్తిగీతాల నడుమ ఊరేగించారు. రిమోట్ కారులో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు, చుట్టూ మార్మోగిన భక్తి గీతాలు, చిన్నారుల భక్తి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్న వయసులోనే వారు చూపిన భక్తిని చూసి పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేశారు. నిమజ్జన సమయంలో చిన్నారులు విఘ్నేశ్వరుడికి కన్నీటి వీడ్కోలు పలకడం పలువురిని భావోద్వేగానికి గురిచేసింది. ఆర్భాటానికి దూరంగా చిన్నారులు చూపిన భక్తి ప్రత్యేకంగా నిలిచింది.

## ఆధ్యాత్మిక శోభతో పోలీసు సురక్ష గణనాథుని నిమజ్జనం





**వనపర్తి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథునికి సమర్పించిన లడ్డూలకు వేలం నిర్వహించగా.. పెద్ద లడ్డూ రూ.61 వేలకు, చిన్న లడ్డూ రూ.21 వేలకు పోలీసు సిబ్బంది దక్కించుకున్నారు. అనంతరం భజనలు, బాజాభజంత్రీలు, కోలాటాలు, జై గణేశ్ నినాదాలతో గణనాథుని ఊరేగింపు నిర్వహించి ఘనంగా నిమజ్జనం చేశారు. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసుశాఖ కృషి చేస్తోందని ఆమె తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ - 2026 పురోగతిపై ఈఆర్ఓ హరిప్రియ సమీక్ష



**జడ్చర్ల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టిన ఎస్ఐఆర్ - 2026 (ప్రత్యేక సమగ్ర సమీక్ష) ప్రక్రియను నిర్ణీత కాలపట్టిక ప్రకారం ప్రశాంతంగా, త్వరితగతిన పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్, జడ్చర్ల ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) జె.ఎల్.బి. హరిప్రియ కోరారు. బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నోటీసుల అందజేత, విచారణల (హియరింగ్స్) పురోగతిని ఈఆర్ఓ వివరించారు. విచారణల ప్రక్రియ సమయపట్టిక ప్రకారమే కొనసాగుతోందని, క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. అర్హులైన ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా పార్టీల నాయకులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, అదనపు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, సహాయ తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బంది, వివిధ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గౌతాపూర్ లో పెన్షన్ దారుల ఇంటింటి విచారణ!





**బాలానగర్, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్, మండలం గౌతాపూర్ గ్రామంలో పెన్షన్ లబ్ధిదారుల ఇంటింటి విచారణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామంలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వికలాంగుల పెన్షన్లు పొందుతున్న వారి ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్లి విచారణ చేపట్టారు. లబ్ధిదారులు నిజంగా అర్హులా కాదా అని, వారి ఆధార్, బ్యాంక్ వివరాలను పరిశీలించారు.
ఈ విచారణ కార్యక్రమంలో పెన్షన్ అధికారి, గ్రామ సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్, ఉప సర్పంచ్ పెద్దోని యాదయ్య వార్డు సభ్యులు ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి నరేష్, శేఖర్ పాల్గొన్నారు. గ్రామంలోని వృద్ధులు ఇంటికి, వీల్ చైర్ లో ఉన్న వికలాంగుడి ఇంటికి వెళ్లి వారి వివరాలు సేకరించారు. ఇంట్లోనే ఉండి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న పెన్షన్ దారుల వద్దకు స్వయంగా వెళ్లి విచారణ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చూస్తామని, అనర్హులను తొలగించి నిజమైన పేదలకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

## పగటిపూటా వెలుగుతున్న వీధిదీపాలు!



**కోహీర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** కోహీర్ మండలంలోని పలు గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాత్రివేళ వెలుతురు అందించాల్సిన దీపాలు పగటి పూట కూడా వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఈ సమస్యపై గతంలో పలు మార్లు వార్తా కథనాలు వచ్చినా పరిస్థితిలో మార్పు కనిపించడంలేదని వాపోతున్నారు.
గోటిగార్పల్లి, సిద్దాపూర్ తండా, పర్సపల్లి, బడంపేట్, బిలాల్‌పూర్, పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, కవేలి, దిగ్వాల్, మద్రి, గుర్జువాడ, రాజానెల్లి, కొత్తూరు, ఖానాపూర్, పిచ్చరాగాడి తదితర గ్రామాల్లో పలు ప్రాంతాల్లో పగటిపూట కూడా వీధిదీపాలు వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని చోట్ల స్విచ్‌లు లేకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో ఆటోమేటిక్ టైమర్లు పనిచేయక పోవడమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు.
పాడైన టైమర్లు, స్విచ్‌లను మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.
ప్రజాధనంతో వినియోగించే విద్యుత్‌ను పొదుపు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, పనిచేసే స్విచ్‌లు, టైమర్లు ఏర్పాటు చేసి పగటిపూట వీధిదీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వినాయక నిమజ్జనంలో విషాదం..

- ఈత రాక చెరువులో మునిగి ఆరుగురు దుర్మరణం
- మట్టి కోసం తీసిన గుంతలే ప్రమాదానికి కారణమా?
- ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి







**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనం కోసం చెరువు వద్దకు వెళ్లిన ఆరుగురు విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన పటాన్‌చెరు పరిధిలోని పెద్ద కంజర్ల శివారు నేరేడు చెరువు వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని శివనగర్ చౌరస్తా వద్ద ఉన్న శిరీష చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులు వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో చెరువులో మట్టి కోసం తీసిన గుంతలు ఉన్న విషయం తెలియక లోపలికి వెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

ఈత రాకపోవడంతో ఆరుగురు విద్యార్థులు నీటిలో మునిగిపోయారు. మృతులను నర్సింహరాజు (18), సుమంత్‌రెడ్డి (17), గణేష్ (18), ఉదయ్‌కిరణ్ (22), తేజ (17), సిద్ధార్థ్ (15)గా గుర్తించారు. వీరిలో ఉదయ్‌కిరణ్ డిప్లొమా మూడో సంవత్సరం, సుమంత్‌రెడ్డి, గణేష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం, తేజ డిప్లొమా ప్రథమ సంవత్సరం, నర్సింహరాజు బీటెక్ ద్వితీయ సంవత్సరం, సిద్ధార్థ్ పదో తరగతి చదువుతున్నట్లు సమాచారం.

ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులను పటాన్‌చెరులోని ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని తోటి విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బందిని అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్ కూడా ఆసుపత్రికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించే అవకాశం ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిరీష ట్రస్ట్‌లో 70 మంది విద్యార్థులు

పెద్ద కంజర్ల శివనగర్ చౌరస్తా వద్ద శిరీష చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ట్రస్ట్‌లో సుమారు 70 మంది విద్యార్థులు ఉండగా, ఒకటో తరగతి నుంచి పాలిటెక్నిక్, బీటెక్ వరకు విద్యను అందిస్తున్నట్లు తెలిసింది. తల్లిదండ్రులు లేని విద్యార్థులను మాత్రమే ట్రస్ట్‌లో చేర్చుకుంటున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణంరాజు తన కుమార్తె శిరీష పేరుతో ఈ ట్రస్టును నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీల సామాజిక, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. బుధవారం నారాయణపేటకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి ల్యాండ్, సర్వీస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు మర్యాదగా మాట్లాడి సమస్యను పూర్తిగా తెలుసుకుని తగిన మార్గనిర్దేశం చేయాలని అన్నారు. ప్రతి నెల చివరి వారంలో జరిగే సివిల్ రైట్స్ డే సమావేశాలకు సంబంధిత ఎస్‌ఐలు, తహసీల్దార్లు తప్పనిసరిగా హాజరై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని, అర్హులకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్లు, రోస్టర్ విధానం, రిజర్వేషన్ రిజిస్టర్లను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు ఇతర అవసరాలకు మళ్లకుండా ఆయా వర్గాల అభివృద్ధికే వినియోగించాలని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. జిల్లాలో 90,832 మంది ఎస్సీలు, 28,843 మంది ఎస్టీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సుమారు 26 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలని చైర్మన్ స్పష్టం చేశారు. సమావేశంలో కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అపశృతులకు తావులేకుండా వినాయక నిమజ్జనాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 16 (జనం సాక్షి): వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్లు, గద్వాల నది అగ్రహారం పుష్కర ఘాట్ల వద్ద నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పెద్ద విగ్రహాలు, వాహనాలు సులభంగా చేరుకునేలా తాత్కాలిక రహదారులను చదును చేసి, అవసరమైన చోట్ల మట్టి, మొరం, రాళ్లతో బలోపేతం చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, రాత్రివేళల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు, చిన్న, భారీ విగ్రహాలతో వచ్చే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసి బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.

నిమజ్జన ప్రాంతంలోకి అనవసర వాహనాలను అనుమతించకుండా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసులకు సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, క్రేన్లు, రోలర్లు, అగ్నిమాపక వాహనాలు, 108 సేవలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. మత్స్యకారులు, గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా విధుల్లో ఉంచి నదిలో భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని, నిమజ్జన ఏర్పాట్లకు వినియోగించే వాహనాలు, యంత్రాలు, సిబ్బంది విధులపై రోజువారీ రికార్డులు నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ వై. మొగిలయ్య, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉపకరణాలకు సున్నా నిధులు..

- దళారులను నమ్మితే నిలువునా మునగడమే!



గద్వాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి): దివ్యాంగులకు ప్రభుత్వం అందించే సహాయక ఉపకరణాల కోసం ఎదురుచూస్తున్న వారికి కోలుకోలేని షాక్ తగిలింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి ఎలాంటి నిధుల కేటాయింపులు లేవు అని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్వయంగా ప్రకటించడం తీవ్ర కలకలం రేపుతోంది. బుధవారం ఆయన విడుదల చేసిన అధికారిక ప్రకటన జిల్లావ్యాప్తంగా అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిధులు లేని ప్రస్తుత పరిస్థితుల్లో అమాయకులను ముంచేందుకు దళారులు రంగంలోకి దిగే ప్రమాదం ఉందని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో భక్తులు, ప్రజలు గమనించాల్సిన ముఖ్యమైన అంశాలు వివిధ ప్రభుత్వ పథకాల పేరుతో దివ్యాంగ ఉపకరణాలు మంజూరు చేయిస్తామంటూ డబ్బులు వసూలు చేసే మోసగాళ్లను నమ్మి అస్సలు మోసపోవద్దు. ఉపకరణాల ఆశ చూపి ఎవరైనా నయా పైసా డబ్బులు అడిగితే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారులు లేదా పోలీసులకు సమాచారం అందించాలి. ఈ విషయాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా జిల్లా సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించి వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రభుత్వ నిధులు లేవన్న చేదు నిజాన్ని గ్రహించి, దళారుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## భారీ ఇసుక డంప్ సీజ్



**కృష్ణ, సెప్టెంబర్ 16, (జనంసాక్షి):** కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో బుధవారం రెవిన్యూ అధికారులు, భారీ ఇసుక డంప్ ను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీనివాసులు , ఆర్ ఐ, ఎవస్ ఐ యాదయ్య, జిపివో , సంఘటన స్థలానికి చేరుకుని 15 టిప్పర్ ల ఇసుక డంప్ ను సీజ్ చేశారు.

### క్షీరసాగర మథన దృశ్యాలతో

## అలరిస్తున్న గద్వాల గణనాథుడి మండపం!



**గద్వాల, సెప్టెంబర్ 16( జనంసాక్షి):** గద్వాల పట్టణంలోని ప్రముఖ పాండురంగ స్వామి ఆలయం వద్ద స్వకులశాలి సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గత 53 ఏళ్లుగా పురాణ ఘట్టాల నేపథ్యంతో ఈ మండపాన్ని అలంకరించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా, దేవతలు మరియు దానవులు అమృత భాండం కోసం సాగరాన్ని మథించిన 'క్షీరసాగర మథనం' సన్నివేశాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, కంటికి కట్టినట్లుగా తీర్చిదిద్దారు. చిన్నారులకు మన సంస్కృతి, సాంప్రదాయాలు మరియు ఇతిహాసాలపై అవగాహన కల్పించడమే ఈ ప్రదర్శన యొక్క ముఖ్య లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఐదు దశాబ్దాల చరిత్ర: ప్రతి సంవత్సరం ఒక విలక్షణమైన పౌరాణిక ఘట్టాన్ని ఇక్కడ ప్రదర్శిస్తూ, ఐదు దశాబ్దాలుగా ఈ సంప్రదాయాన్ని నిర్వాహకులు విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్షీరసాగర మథన వినాయక మండపాన్ని సందర్శించడానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## సరదాగా టిక్‌టాక్ చేసి సినిమా అవకాశం వరకు...






**రాజాపూర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** రాజాపూర్ మండల పరిధిలోని మారుమూల గిరిజన తాండా అయిన మల్లిబాయి తాండాకు చెందిన గిరిజన యువకుడు కిట్టుపవన్ బంజారా ప్రైవేటు ఆల్బమ్ సాంగ్స్ చేస్తూ, యూట్యూబ్ లో ఎక్కువ వీవ్యూస్ ను పొందిన కిట్టు పవన్ ను జనంసాక్షి రిపోర్టర్ అడిగినా కొన్ని విషయాలు. తన మొదటి ప్రస్థానం లాక్ డౌన్ సమయంలో యాక్టింగ్ మీద ఉన్న ఇష్టం తో కొన్ని వీడియోలు చేయడం మొదలు పెట్టినట్లు తెలిపాడు. ఆ వీడియోలు చూసినా కొందరు మిత్రులు బంజారా ప్రైవేటు ఆల్బమ్ పాటలు చేయిస్తే మొట్టమొదటి సారిగా "వీరేనా భాయి" పాట మంచి గుర్తింపు తెచ్చింది అని తెలిపాడు. తెలుగు లో "అత్తారింటికి" పాట చాలా పెద్ద గుర్తింపు తెచ్చిందని కిట్టు పవన్ తెలిపాడు. దాదాపు వందకు పైగా పాటలు చేసిన తనకు సినిమా లో కూడా అవకాశం వచ్చిందని కిట్టు సంతోషం వ్యక్తం చేశాడు.

మారుమూల గిరిజన తాండా నుండి హైదరాబాద్ వెళ్ళిన కిట్టు కుటుంబంలో తండ్రి డ్రైవర్,తల్లి కూలీ చేసిన కిట్టును డిగ్రీ వరకు చదివించారని ఉద్యోగం కోసం సమయం వృధా చేయకుండా తనకు నచ్చిన యాక్టింగ్ తో మంచి గుర్తింపు తెచ్చుకోవడం. అందరికీ ఆదర్శం.